
# జలాధివాసం

ఆంధ్రజ్యోతి వీక్లీ, 6 అక్టోబర్, 2000



పని ఒత్తిడిలో అసహనంగా తన అఫీసులో కదలాడుతున్న భువనచంద్ర కళ్ళను ఆ పొడవాటి బ్రౌన్ కలర్ కవరు ఆకట్టుకుంది.

ఆరోజు తన పర్సనల్ పోస్టు చూసుకుంటున్నాడతను. ఆఫీసు కరస్పాండెన్సంతా తాము వ్యక్తిగతంగా చూడవలసిందైతే తప్ప సెక్రెటరీ అటెండవుతాడు. పర్సనల్ టపా మాత్రం తన టేబుల్ మీద ఉంటుంది.

ట్రేలో కొన్ని కవర్లు అతనికి డైరెక్టుగా అడ్రస్ చేయబడినవి ఉన్నాయి. అన్నింటిలోను కాస్త నలిగి, పాతదిలా కనిపిస్తున్న కవర్ ఏమిటో ముందు చూడాలని కుతూహలం కలిగింది.

ముద్ర సరిగా పడని ఫ్రం అడ్రస్ రబ్బర్‌స్టాంపుని క్షణం చూసి నైఫ్‌తో లోపలి పేపర్ కట్ కాకుండా సన్నగా చించాడు.

'జిల్లా పరిషత్ హైస్కూలు- పాత విద్యార్థుల సమావేశానికి ఆహ్వానం' అన్ని ఉన్న లెటర్ అంశం అతనిలో కుతూహలం కలిగించింది.

ఊళ్లో హైస్కూలు స్థాపించి 50 సంవత్సరాలు నిండిన సందర్భంగా స్వర్ణోత్సవ వేడుకలు జరుపుతున్నారు. అందులో ముఖ్య అంశంగా పాతవిద్యార్థుల సమావేశం ఏర్పాటుచేయబడింది. ఈసారి సమావేశానికి ముఖ్య అతిథులు 1975వ సంవత్సరంలో స్టేట్‌ర్యాంక్స్ సాధించి ఇప్పుడు ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీసెస్‌లో పనిచేస్తున్న నలుగురు ప్రముఖులు.

'అప్పటి ఈ పాఠశాల విద్యార్థులను గౌరవించదలచింది స్కూలు కమిటీ. దానికి మీరు తప్పక హాజరై సమావేశాన్ని జయప్రదం చేయవలసిందిగా కోరుతున్నాం.'

క్రింద ప్రత్యేక అంశంగా '1970 సంవత్సరం నుండి 1982 వరకు స్కూలు హెడ్‌మాస్టర్‌గా పనిచేసి రికార్డు స్థాయిలో స్కూలుని అభివృద్ధి చేసిన జగన్నాథం మాస్టారుగారికి పుష్పాభిషేక సన్మానం జరుపబడును' అని ఉంది. 'దానికి మీరు తప్పక హాజరై సమావేశాన్ని జయప్రదం చేయవలసిందిగా కోరుతున్నాం.' -ఇదీ లెటర్ సారాంశం. క్రింద స్కూలుస్టాంపు, ప్రస్తుత ప్రధానోపాధ్యాయుని సంతకం ఉన్నాయి.

భువనచంద్ర ముఖంలో చిరునవ్వు కదిలింది.

ఆ ఆహ్వానాన్ని అపురూపంగా చేతిలోకి తీసుకొని ఆప్యాయంగా మళ్లీ మళ్లీ చదువుకున్నాడు. అతని చూపు జగన్నాథం మాష్టారి పేరుమీద నిలిచిపోయింది.

మంత్రోచ్చారణ చేస్తున్నట్లు అతని పెదవులు "మాష్టారూ... మాష్టారూ..." అనుకుంటుంటే- పదేపదే అతని మనోనేత్రంలో బాల్యం, హైస్కూలు చదువు, మాష్టారు, స్నేహితులు అన్నీ వచ్చి నిలిచాయి.

● ● ●

పవిత్ర గోదావరీ జలాలతో పునీతమవుతున్న గోస్త నదీ ఒడ్డునగల చిరుగ్రామం 'కొండేపూడి!'

పచ్చని బయళ్ళలో పట్టు తివాచి పరిచినట్లుండే ఆ ఊరును భువనచంద్రే కాదు, కొంచెం భావుకత ఉన్న ఏ వ్యక్తీ మరచిపోలేడు. మండువేసవిలో కూడా గలగల పారే జీవనది... గోస్తనది! గ్రీష్మంలో ఆ ఊరివాసులకు అదే ఆధారం! ఆ నది ఒడ్డున నిర్మలంగా అందరూ కలసి ఆడుకొనే ఆ బాల్యపు ఛాయలు ఎంత తీయన!

ఒక్కసారి భువనచంద్ర మదిలో 'భావన' కదలాడింది.

భావన ఆ ఊరి ప్రెసిడెంట్‌గారమ్మాయి..!

ఒకసారి గోస్తనీలో అందరూ జలకాలాడుతోంటే భావన కాలు జారి నీళ్లలో పడి కొట్టుకుపోతుంటే... ప్రాణాలకు తెగించి తను రక్షించాడు. ఆనాడు తనపై ఆమె చూపిన ఆపేక్ష ఎన్నటికీ మరువలేడు. భావన ఇప్పుడు ఎక్కడ ఉందో... ఎలా ఉందో?!

జగన్నాథం మాష్టారు... పేరు తలచుకోగానే భువనచంద్ర శరీరం పులకించిపోయింది. మాష్టారులాంటి విశిష్ట వ్యక్తిత్వాలు ఈ జనారణ్యంలో ఇంకా ఉండబట్టే సూర్యచంద్రులు ఇంకా ఉదయిస్తున్నారనేది తన గట్టి నమ్మకం!

ఆయనంతటి విలక్షణమైన వ్యక్తిత్వంతోనే తమ జీవితాలకు ఒక అర్థాన్నీ, స్ఫూర్తినీ కలిగించిన మహనీయుడాయన!

అందరూ ఎలా ఉన్నారో.., మాష్టారెలా ఉన్నారో?! చదువు పూర్తయ్యాక అందరూ ఆ ఊరు వదిలేసి సిటీకి వచ్చి స్థిరపడిపోయారు. ఆరోజుల్లో తమది ఊరు చివర్లో చిన్నపూరిల్లు! ఊరి మధ్య నాలుగు రోడ్ల సెంటర్‌లో గోనెపట్టా పరచుకొని, వంగిన గొడుగుని కప్పుగా నాన్న చేసుకొనే పాతచెప్పులు కుట్టే వృత్తి! రెక్కాడితే కాని డొక్కాడని తమ చిల్లరబ్రతుకులలో చిరుదీపాలు వెలిగించి, తమ ఆశలకు వాస్తవరూపాన్ని కలిగించిన జగన్నాథం మాష్టారికి తమలాంటి వారు ఎంత ఇస్తే మటుకు సరిపోతుంది? అందుకే భువనచంద్రకే కాక, ఆయన వద్ద చదువుకున్న ప్రతి విద్యార్థి ఆయన్ని నడుస్తున్న దేవుడుగా భావిస్తారు.

స్వతహాగా భావుకత, సున్నిత హృదయం కలిగిన భువనచంద్ర 'కోటిదీపాల వెలుగు సూర్యుని ముందు వెలవెలబోతుంటే... మాష్టారి మనోభీష్టమనే దీపపు కాంతి ముందు ఆ సూర్యుడే వెలవెలబోతున్నాడు!' అనుకోకుండా ఉండలేకపోయాడు.

సరిగ్గా దుర్భర దారిద్ర్యాన్ని అనుభవిస్తున్న ఆ సమయంలో ఎలా పడ్డాడో, ఎప్పుడు పడ్డాడో- జగన్నాథం మాష్టారి దృష్టిలో పడ్డాడు భువనచంద్ర. గోనెసంచి పరచుకొని ఎండవేడిమిలో, శిథిలమైన వ్యక్తిత్వంతో చిరిగిన పాతచెప్పులు కుట్టుకొని పావలా, అర్థా సంపాదించుకొని బ్రతుకీడ్చవలసిన తన దశ- మాష్టారి పుణ్యమా అంటూ మారిపోయింది.

ఈ స్థితి ఒక్కరోజులో తెచ్చుకున్నది కాదు... ఎంతో కఠోర పరిశ్రమ! వన్నెకోసం బంగారాన్ని కొలిమి రగిల్చి కాల్చినట్లు ఒక లక్ష్యంకోసం మాష్టారు తమను ఎంత కఠినంగా శిక్షించేవారో! ప్రాతఃకాలంలో ఎముకలు కొరికే చలిలో కూడా నిద్ర లేపి, మీద చన్నీళ్లు గుమ్మరించి మత్తును పారద్రోలి చదివించేవారు. మాష్టారు వేసిన శరీరం మీద దెబ్బల తాలూకు మచ్చలు ఆనాటి అకుంఠిత దీక్షకు చిహ్నంగా ఇంకా అలాగే ఉండిపోయాయి.

జగన్నాథం మాష్టారు ఎంత కఠినంగా వ్యవహరించేవారో- అంత ప్రేమగా, సున్నితంగా విద్యాబుద్ధులు నేర్పించేవారు. ఆయన క్రమశిక్షణను తోటి ఉపాధ్యాయ బృందం కూడా ఎంతో గౌరవంతో పాటించేవారు. మొదట్లో చిన్నతనం మూలాన మాష్టారి తీవ్రతకీ, శిక్షలకూ తట్టుకోలేక భువనచంద్ర, అతని మిత్రులు కూడా బడికి వెళ్లనని మొరాయించేవారు. గురువుగారి అంతరంగాన్ని, ఆయన దీక్షను అర్థంచేసుకున్న అమ్మా నాన్నలు మళ్లీ తమని లాలించి, బుజ్జగించి బడికి పంపేవారు. అప్పట్లో ఆయన అనేమాటలు తనకు అర్థంకాకపోయినా ఎప్పుడూ గుర్తుంటాయి-

"పుట్టుకతో ఎవరూ గొప్పవారు కాలేదు. తగిన శిక్షణ, కృషి ఉంటే మాణిక్యంలా ప్రకాశిస్తారు. పిల్లల భవిష్యత్‌కి తగిన బలమైన పునాదిరాయి ఈ వయసులోనే పడాలి. పునాది సరిగా పడని విద్యార్థి భవితవ్యం అస్తవ్యస్తంగా తయారవుతుంది."

క్రమంగా శిక్షణకు తామంతా అలవాటుపడిపోయారు. తరువాత, తరువాత మాష్టారు చదువుకోమని మందలించవలసిన అవసరం కానీ, శిక్షించవలసిన పనికానీ లేకుండాపోయింది.

వేరువేరు సామాజిక వర్గాల నుండి, కులాల నుండి ప్రతిభ గల విద్యార్థుల నెంచుకొని జగన్నాథంగారు అనితరసాధ్యంగా చేసిన కృషి సాకారమైంది. తామందరూ మంచి స్టేట్‌ర్యాంక్స్ సాధించారు.

ఆ మాష్టారి ఆశీర్వచన బలంతో, పెద్దల సాయంతో, స్కాలర్‌షిప్స్‌లతో తమ చదువు నిరాటంకంగా సాగిపోయింది.

కాలగమనంలో కల్టెకరుగా ఎంపికయ్యాక భువనచంద్ర మాష్టారి ఆశీస్సులు తీసుకున్నాడు. ఒక చెప్పులు కుట్టే చర్మకారుడి కుమారుని స్థాయి నుండి కలెక్టర్ స్థాయికి ఎదిగిన తన ప్రియశిష్యుడిలో తన ఆశయసౌధాల్ని చూసుకొని ఆయన సంతృప్తిగా ఆనందించారు.

"నాన్నా భువనా! నీవు ఇప్పుడు సమాజంలో ఉన్నతమైన వ్యక్తివి. అత్యంత విలువైన నీ ఉద్యోగధర్మంతో పాటు అంధకారంలో కొట్టుమిట్టాడుతున్న ఈ సమాజంలోని పలువురు విద్యార్థులకి నీ వంతు తోడ్పాటు నిచ్చి, వారిని పైకి తీసుకురా! అదే నీవు నాకిచ్చే గురుదక్షిణ!"

మాష్టారి ఆర్తిని చూసి చలించిపోయాడు భువనచంద్ర.

వాస్తవంలోకి వచ్చిన భువనచంద్ర- చాలా ఆనందంగా తన మిత్రులు నలుగురికీ విషయాన్ని తెలియజేశాడు.

పాతవిద్యార్థుల సమావేశానికి ఆ స్కూలు పాతవిద్యార్థులంతా వెళ్లాలని నిర్ణయించుకున్నారు.

• • •

భువనచంద్ర తప్ప మిగతా నలుగురు పాతవిద్యార్థులు ఒకరోజు ముందుగానే తమ స్వగ్రామం 'కొండేపూడి' చేరుకున్నారు.

స్టూడెంట్స్ ఫెడరేషన్ వారికి మంచి వసతి, సౌకర్యం ఏర్పాటుచేసింది.

ఊరు చేరగానే నలుగురూ ముందుగా వాళ్ళ జగన్నాధం మాష్టార్ని చూసివచ్చారు.

25 సంవత్సరాల క్రితం కట్టుకొన్న చిన్న సిమెంట్‌రేకుల ఇల్లు, అవే పరిసరాలు! ఇంటిముందు పెద్ద వృక్షాలు, క్రింద కూర్చోటానికి నాపరాయి అరుగులు! ముందు పంచ, లోపల హాలు, వంటగది, చిన్న పెరడు! ఆ తరువాత ఆయన ఇంటికి ఏ వసతీ ఏర్పరచుకోలేదని చూడగానే తెలుస్తోంది.

"అమ్మాయికి పెళ్ళయిపోయింది. అబ్బాయి ఏదో చిన్నఉద్యోగంలో చేరి గడుపుతున్నాడు. ఇక్కడ మేమిద్దరం ఉన్నాం. రోజులు బాగానే గడిచిపోతున్నాయి. ఇంకా ఒంట్లో ఓపిక ఉంది కనుక ట్యూషన్లు చెప్తున్నాను" అన్నారే కాని-

ఆయన ఇంటి పరిస్థితి ఏమీ బాగాలేదని, మంచిపొజిషన్‌లో ఉన్న శిష్యులకు అర్థమైపోయింది. పచ్చని పసిమితో ఉండే నిలువెత్తు శరీర దారుఢ్యం ఏమైపోయిందో- వడిలిపోయి, శుష్కించి ఉన్నారు.

70 సంవత్సరాలు పైబడిన వృద్ధాప్యం, పేదరికం ఆయనని కృంగదీస్తున్నాయి.

"నేను రాత్రి కార్యక్రమానికి నేరుగా స్కూలుకే వచ్చేస్తాను. అప్పటికి భువనచంద్ర వస్తాడేమో! ఈలోగా ట్యూషన్స్ పూర్తిచేసుకుంటాను. మీరు గెస్ట్‌హౌస్‌కి వెళ్లి కాస్త విశ్రాంతి తీసుకోండి."

మాష్టారి భార్య అందరికీ మజ్జిగ ఇచ్చారు. గోరంచు జరీవున్న పాత నేతచీర చెంగు భుజంనిండా కప్పుకొని, జడలో రెక్కమందారం, నుదుట కుంకుమ, కళ్ళకి కాటుక, పసుపు పూసిన పాదాలతో అరవై సంవత్సరాలు పైబడిన వయస్సులో పండుముత్తయిదువులా ఉందామె.

నలుగురూ గెస్ట్‌హౌస్‌కి వచ్చారు...

అందరి మనస్సులూ బరువెక్కి ఉన్నాయి...

అందరూ ఐ.ఏ.ఎస్., ఐ.పి.ఎస్.ర్యాంక్స్‌లో ఉన్నత పదవులలో కొనసాగుతున్నారు. తమ జీవితాలకు పటిష్టమైన పునాదివేసి, ఉక్కుసంకల్పంతో తీర్చిదిద్దిన జగన్నాథం మాష్టారి నేటి స్థితి వారి మనసుల్ని తీవ్రంగా గాయపరిచింది.

“మనం ఇంత మంచిపొజిషన్‌లో స్థిరపడగలిగామంటే దానికి హెడ్‌మాష్టారు జగన్నాథంగారే కారణం! ఆరవ తరగతి నుండి పదో తరగతి వరకూ ఆయన మనల్ని కఠిన క్రమశిక్షణతో ఎలా సానపట్టారో! ఆనాడు ఆయన అంత శ్రద్ధ తీసుకొని ఉండకపోతే మనమీనాడు ఈ స్థాయిలో ఉండేవాళ్ళం కాదు. మనకు గుర్తుంది... తల్లిదండ్రులు కూడా తీసుకోని బాధ్యత- గురువుగా ఆయన తీసుకున్నారు. నాలుగు కులాల నుండి నలుగురు తెలివైన విద్యార్థుల్ని ఎంపిక చేసుకొని నిరంతరం శ్రమించి మన మేధకు పదును పెట్టారు. మనం ముందు ‘ఆచార్య దేవోభవ’నే ఆచరిస్తే- పేరెంట్స్ మనకు కావలసిన ఆర్థిక వనరులు సమకూరిస్తే- గురువుగారు మేధోసంపదని పెంపొందింపజేశారు. ఫలితంగా ఈ ఉన్నత స్థానాలు పొందగలిగాం.

అందుకు కృతజ్ఞతగా మనం వ్యక్తిగతంగా మాష్టార్ని సత్కరించుకోవాలి. ఇంకా ఆయన ట్యూషన్స్ చెప్పుకుంటున్నారంటే మనం సిగ్గుపడాలి!”

- ఇలా నలుగురు తపనపడి అప్పటికప్పుడు ఆలోచించుకొని, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న నిరంజన్- “నేను మాష్టారికి నా వంతుగా మంచి వసతులతో ఏ.సి. బిల్డింగ్ కట్టిస్తాను” అన్నాడు.

ఇంకో ఐ.పి.ఎస్. అధికారి వసంతరావ్- “నేను మాష్టారికి ఆయన పేర పదిలక్షలు రూపాయలు డిపాజిట్ చేస్తాను. దానిమీద వచ్చే వడ్డీతో ఆయన సుఖంగా గడపగలరు.”

“నేను మాష్టారికి ఏ.సి. కారు ప్రెజెంట్ చేస్తాను. ఇందాక అరిగిపోయిన చెప్పులతో పాదాలు తడబడుతుంటే ఆయన నడక నాకెంతో బాధ కలిగించింది!” అన్నాడు సెక్రెటరీగా పనిచేస్తున్న మాలకొండయ్య.

“ఆయన ఇతర ఖర్చులకు ఓ పదిలక్షలు నేను ఇవ్వాలనుకుంటున్నాను” అన్నాడు మరో ఐ.ఏ.ఎస్. ఆఫీసర్ కబీర్‌దాస్.

సాయంత్రం సన్మాన సభలో ఇవన్నీ డిక్లేర్ చేయడానికి నిర్ణయించుకున్నాక వాళ్ళ మనసులు కాస్త శాంతించాయి.

• • •

వార్షికోత్సవ సభ మొదలువుతుంగా కలెక్టర్ భువనచంద్ర వచ్చాడు.

అతని ముందు వెనుకలు పది పెట్రోలింగ్ వెహికిల్స్ రివ్వున వచ్చి స్కూలు ఆవరణలో ఆగాయి. గన్‌మెన్ మంచి ప్రొటెక్షన్ ఈయగా భువనచంద్ర లోపలికి వచ్చాడు. స్కూలు ఆవరణ అంతా వి.ఐ.పి.లతో, పెద్దలతో, స్టూడెంట్స్‌తో కోలాహలంగా ఉంది.

భువనచంద్ర అపురూపంగా తన చిన్ననాటి స్కూలుభవనాన్ని చూసుకున్నాడు. అదే భవనం, అవే తరగతి గదులు, అదే ప్లేగ్రౌండ్, అవే చెట్లు చేమలు! అతని మనస్సు ఆనందంతో ఎక్కడికో పరుగులు తీస్తోంది. అక్కడి ప్రతిఅణువులోను జగన్నాథం మాష్టారు కనబడుతున్నారు తనకి. కాలప్రవాహానికి చెక్కుచెదరని దృఢసంకల్పంలా, సగర్వంగా నిలబడివుంది... తన హైస్కూలు భవనం!

త్వరత్వరగా తనకి ఎదురై సాదరంగా ఆహ్వానిస్తున్న ప్రస్తుత హెచ్.ఎం.ని, అధ్యాపక బృందాన్ని, స్టూడెంట్స్‌నీ చూశాడు. అతని కళ్ళు జగన్నాథం మాష్టారికోసం ఆత్రంగా వెదికాయి.

అంతలో... అతని రాక గ్రహించిన ఇతర మిత్రులు వచ్చి కలిశారు.

నెమ్మదిగా నడుచుకుంటూ వస్తూన్న జగన్నాథం మాష్టారికి ఎదురేగి పాదాభివందనం చేశాడు భువనచంద్ర. తన శిష్యుల స్థాయిని చూసి ఆనందంతో ఉప్పొంగిపోయారాయన.

సభ మొదలై అనందోత్సాహాల మధ్య మాష్టారి పుష్పాభిషేకం పూర్తయింది!

పెద్దల ఉపన్యాసాలు కొనసాగుతున్నాయి. విద్యాగంధాన్ని ప్రసాదించిన తమ ప్రియతమ గురువరేణ్యులకు తాము ఏ విధంగా చేయూత నీయదల్చుకొన్నదీ ప్రకటించారు నిరంజన్, వసంతరావ్, మాలకొండయ్య, కబీర్‌దాస్! ఉప్పొంగిన ఉత్సాహంతో, ఆర్భాటంగా తన సహాయాన్ని ప్రకటించాడు భువనచంద్ర. ప్రేక్షకులు వీరి ఉదార స్వభావానికి, ఔదార్యానికి జేజేలు పలికుతూ కొట్టిన చప్పట్లతో మిన్నుముట్టుతున్నాయి. చివరిగా ఉపన్యాసానికి మాష్టారి వంతు వచ్చింది.

"ఈ కొండేపూడి చిరుగ్రామంలో, ఈ హైస్కూలులో చదివిన ప్రతి విద్యార్థి మంచి జీవితాలను గడుపుతున్నందుకు నాకు చాలా ఆనందంగా ఉంది. ఒకవిధంగా ఇక్కడ నేను నా ఉద్యోగధర్మాన్ని నిర్వర్తించడం నా అదృష్టంగా భావిస్తాను. ఈనాడు సుదినం... నేను మరచిపోలేని రోజు! ఈరోజు నా శిష్యులు సుదూర తీరాల్లో ఎంతో కీలకమైన ఉద్యోగాలు చేస్తూ ఇక్కడకు వచ్చి ఈ వార్షికోత్సవంలో పాల్గొనడం ఆనందదాయకం. ఒక వ్యక్తి పైకి వచ్చినప్పుడు తన వారికి పదిమందికి చేయూతనివ్వాలి. మన సమాజంలో ఎంతోమంది పిల్లలు తెలివీ, తృష్ణా ఉన్నా- చదువుకోగల అవకాశాలు లేక ఆగిపోతున్నారు. విజ్ఞానం అనేది నిరంతరం ప్రవహించే జీవనదిలా ఒకరి నుండి మరొకరికి అందాలి. అప్పుడే జాతి వికాసం సాధ్యమవుతుంది. ఒక బడుగువర్గం నుండి పైకివచ్చిన వ్యక్తి తన వంతు సాయం తన వారికివ్వక తన బాధ్యతను విస్మరిస్తున్నాడు. ఒక స్థాయిలో ఉన్నవారు తమ క్రిందివారికి సహాయపడాలి. అప్పుడే సమాజం సుక్షేత్ర మవుతుంది. అంధకారంలో కొట్టుమిట్టాడుతున్న యువతకు వెలుగు చూపించాలి. ఆ దిశగా మీరు పనిచేయాలి. అదే మీరు నాకిచ్చే బహుమతి! ఒక్కొక్కరు కొంతమంది విద్యార్థుల్ని చేరదీసి చదివించండి. అలా అతడు మరొకర్ని... ఆ మరొకడు ఇంకొందరినీ..! ఒక చిన్నదీపం నుండి కొన్ని వేల దీపాలు వెలిగించవచ్చు. మిమ్మల్ని ఎంచుకొని శ్రమించింది ఆ ఆశయంతోనే! కానీ, మీరు మీ బాధ్యతల్ని సరిగా నిర్వర్తించలేకపోయారు. సమాజాభివృద్ధి వ్యక్తి శ్రేయస్సుపైనే ఆధారపడివుంది. యువత నిర్వీర్యమైతే దేశ ప్రగతి కుంటుపడుతుంది. అలా జరగకుండా చూసుకోవలసిన బాధ్యత మనందరిపైనా ఉంది.

నేను 'శ్రమ దేవోభవ' అన్న నానుడిని నరనరాల్లో జీర్ణించుకున్న వాడిని. మీరు ప్రకటించిన ఏ.సి.బిల్డింగ్, బ్యాంక్ బేలెన్స్, ఏ.సి.కారు... ఇవన్నీ ఈ డెబ్బయ్యో పడిలో మోయగలిగిన ఓపిక, భరించగలిగిన శక్తి నాకు లేవు. దయచేసి ఆశయ జలనిధిలో ప్రవేశించిన నన్ను ప్రశాంతంగా 'జలాధివాసాన్ని' చేయనివ్వండి. అదే ఈ జీవితానికి అర్థం, పరమార్థం చేకూరుస్తుంది."

.మాష్టారి ఉక్కుసంకల్పం ముందు తామెంత అల్పులమో తెలియవచ్చింది ఆ శిష్య బృందానికి.